క్లుప్తంగా

జూనియర్ అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు

విజయనగరం అర్బన్: రాజమండ్రిలో ఇటీవల జరిగిన అండర్ – 18 ఉమెన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో మహారాజా అటానమస్ కళాశాల విద్యార్థిని ఎస్. శ్రావణి రెండు పథకాలు సాధించింది. దీంతో ఆమెను సోమవారం కళాశాల ఆవరణలో అభినందించారు. 400 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానం, మెడ్లే రిలే తేడా అంశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు తెలిపారు. విజేతను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ రవూఫ్

విజయనగరం ఫోర్ట్: రక్తదానానికి మహిళలు ముందుకు రావాలని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. సోమవారం స్థానిక లక్ష్మీస్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో రక్తదానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రక్తదాతలే ప్రాణదాతలని తెలిపారు. ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషులిద్దరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చిన్నమ్ములు, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు...


పార్కు పరిసరాలను శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యన్నపేట ప్రాంతంలో గల మున్సిపల్ పార్క్ పరిసరాలను స్థానికులు శుభ్రం చేసుకున్నారు. పార్కు ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, చెట్ల కొమ్మలు వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా ఉండడంతో వాకర్స్‌తో పాటు సేద తీరేందుకు వచ్చిన వారు ఇబ్బందులు పడేవారు. సమీపంలో చెరువు ఉండడంతో పాములు, విష కీటకాల బెడద కూడా ఉండేది. దీంతో వాకర్లు, స్థానికులు సోమవారం శ్రమదానం చేసి పార్కును శుభ్రపరుచుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ తన సొంత డబ్బులతో మరికొంతమందిని పెట్టి మిగిలిన పనులు చేపట్టారు.

మేనేజ్‌మెంట్ కోర్సులతో టెక్నికల్ ఉద్యోగాలు


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: మేనేజ్‌మెంట్ కోర్సులు చేసిన విద్యార్థులు కూడా టెక్నికల్ విభాగంలో ఉద్యోగాలు పొందవచ్చని అమెజాన్ మేప్స్ క్వాలిటీ స్పెషలిస్ట్ ఉమ్మయ్‌గ హేని అన్నారు. సోమవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ''కరెంట్ ట్రెండ్స్ ఆఫ్ జాబ్స్ అండ్ ఎక్స్‌పీరియన్స్' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డేటా విశ్లేషకులు, వ్యాపార విశ్లేషకులు, ఉత్పత్తి మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, ఐటీ మేనేజర్, తదితర ఎన్నో ఉద్యోగాలు మేనేజ్‌మెంట్ కోర్సు చేసిన వారికి ఉన్నాయన్నారు. స్కిల్స్ ఉంటే తప్పనిసరిగా టెక్నికల్ ఉద్యోగం లభిస్తుందని చెప్పారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు వ్యాపారానికి అవసరమైన నైపుణ్యాలను సంస్థ అందిస్తుందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వివేదుల రామమూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్ వరూధిని, డిపార్ట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతరకు ఏర్పాట్లు

- రూ.35 లక్షలతో నగరంలోని రోడ్లకు మరమ్మతులు
- రూ.12.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం


బాలాజీ జంక్షన్ సమీపంలో గల ఎల్లమాంబ ఆలయం వద్ద ప్యాచ్ వర్కులు చేపడుతున్న దృశ్యం

విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి జాతర నిర్వహణకు కార్పొరేషన్ యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. మూడు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించే జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు లక్షలాదిగా తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి తావులేకుండా ప్రధాన రహదారుల మరమ్మతుల పనులు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజుల కిందట ప్రారంభించారు. ఇందుకోసం రూ.35 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో నగరంలోని 1 నుంచి 25 డివిజన్‌లలోని ప్రధాన మార్గాల్లో ఇప్పటివరకు గుర్తించిన గుంతల్లో ప్యాచ్ వర్క్‌లు చేపడుతున్నారు. అంతేకాకుండా సిరిమాను మూడు సార్లు తిరిగే అమ్మవారి చదురుగుడి నుంచి కోట వరకు గల ప్రధాన మార్గంలో ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేశారు. హుకుంపేట నుంచి అమ్మవారి చదురుగుడికి సిరిమానును తీసుకువచ్చే మార్గంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రూ.35 లక్షలతో చేపడుతున్న ప్యాచ్ వర్క్ పనులను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.


పుత్సలవీది నుంచి కాళ్లనాయుడు మందిరానికి వెళ్లే మార్గంలో వేస్తున్న బీటీ రోడ్డు

రూ.12.50 లక్షలతో బీటీ రోడ్డు..

అమ్మవారి జాతర నేపథ్యంలో మరో ప్రధాన రహదారి పునఃనిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. పుత్సలవీధి జంక్షన్ నుంచి కాళ్లనాయుడు మందిరం వరకు రూ.12.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మొత్తం 160 మీటర్ల పొడవు గల రోడ్డులో గతంలో కుళాయి పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం తవ్వి వదిలేశారు. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారి పండగ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి అటుగా రాకపోకలు సాగించే భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు.

10లోగా ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేస్తాం..

నగరంలో గుంతల పడిన రహదారులకు ఈనెల 10లోగా ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేస్తాం. పైడితల్లి జాతర నేపథ్యంలో ఇప్పటివరకు పనులు ప్రారంభించాం. రూ.35 లక్షలతో అమ్మవారి ఉత్సవం జరిగే ప్రధాన మార్గాలతో పాటు 1 నుంచి 25 డివిజన్‌ల పరిధిలో గుర్తించిన గుంతలకు మరమ్మతులు చేస్తున్నాం. అలాగే రూ.12.50 లక్షలతో పుత్సల వీధి నుంచి కాళ్ల నాయుడు మందిరం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఉత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి తావులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటేశ్వరరావు, ఏఈ, విజయనగరం కార్పొరేషన్.

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి..



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వలంటీర్ల ధర్నా

విజయనగరం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ రవీంద్ర, కో కన్వీనర్లు మోహన్, ఆదిత్య, కుమారి, దేవి నేతృత్వంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ నల్లనయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ.. 2019లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ, యువకులను వలంటీర్లుగా నియమించారన్నారు. వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో విశేష సేవలందించారని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన వలంటీర్లపై చిన్న చూపు తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే వారిని కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడుగు రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.కామేష్, తుపాకుల శ్రీను, వలంటీర్లు పాల్గొన్నారు.

చౌడువాడ వీఓఏపై విచారణ


విచారణ చేస్తున్న ఏపీఎం అరుణ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని చౌడువాడ వీఓఏ ఎం. రామలక్ష్మి స్త్రీనిధి రుణాల రీపేమెంట్‌లో అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై వెలుగు ఏపీఎం అరుణతో పాటు సిబ్బంది గ్రామంలో సోమవారం విచారణ చేపట్టారు. భద్రకాళి మహిళా సంఘం, కనకదుర్గ మహిళా సంఘ సభ్యులు ఇచ్చిన నగదును వీఓఏ పూర్తి స్థాయిలో చెల్లించలేదని సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణకు వచ్చిన ఏపీఎం అరుణ మాట్లాడుతూ.. స్త్రీనిధి రుణాల రీ పేమెంట్‌లో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించమని స్పష్టం చేశారు. బ్యాంక్ ఆన్‌లైన్ స్టేట్‌మెంట్ చూసిన తర్వాత వ్యత్యాసం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు ఎం. నరసింగరావు, ఆకుల దమయంతి, ప్రజాప్రతినిధులు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, పసుపులేటి గోపి, పి. శ్రీనివాసరావు, మొంగం మోహనరావు, మొంగం శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

మహాచండి అవతారంలో దుర్గాదేవి


విజయనగరం టౌన్: మహాచండీదేవి అలంకరణలో దుర్గమ్మ


విజయనగరం టౌన్: గాజుల అలంకరణలో దుర్గమ్మ

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండి అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అనంతరం నిర్వహించిన శ్రీ చక్ర కుంకుమార్చనలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.


నెల్లిమర్ల: థామస్‌పేటలో ఆకట్టుకుంటున్న దుర్గాదేవి సెట్


నెల్లిమర్ల: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆకట్టుకుంటున్న దుర్గాదేవి సెట్ ..

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం సెట్ ఆకట్టుకుంటోంది. వేపచెట్టు తొర్రలో అమ్మవారి విగ్రహంతో పాటు చెట్టు కొమ్మలకు ఉన్న ఉయ్యాలల్లో అమ్మవారి తొమ్మిది అవతారాలు ఏర్పాటు చేశారు. థామస్‌పేటకు చెందిన తీడ వెంకటరావు (శ్రీను) తన సొంత నిధులతో సెట్ వేయడం విశేషం. అర్చకుడు రాంబాబు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో దుర్గాదేవి

విజయనగరం టౌన్: గాజులరేగ సాలివీధి మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల గాజులతో అలంకరించారు. ప్రదీప్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

డెంకాడ: హెచ్‌డీటీగా డి.గాంధీ, ఆర్ఎస్‌డీటీగా బి.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గొలగాం, అమకాం, చింతలవలస –1, నాతవలస, పినతాడివాడ వీఆర్ఓలుగా ఎస్.శిరీషా, ఎం.శ్రీదేవి, వి.తిరుమలరావు, కె.కోమలి, ఎం.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించారని పేర్కొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపండి

- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వామపక్షాల రాస్తారోకో


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీపీఎం, సీపీఐ నాయకులు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు కె.సురేష్, రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ గత సంవత్సరం నుంచి పాలస్తీనాపై జరిపిన దాడుల కారణంగా సుమారు 85 వేల మంది మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా భూ భాగాలపైన, పాఠశాలలు, మసీదులపై వైమానిక దాడులు చేపట్టి వేలాది మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సప్లై చేసి యుద్ధాలకు కారణం అవుతోందని ఆరోపించారు. పశ్చిమాసియా దేశాలలో యుద్ధం కారణంగా మన దేశంలో క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయన్నారు. వెంటనే ఐక్యరాజ్యసమితి కలుగజేసుకుని శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు పి.రమణమ్మ, ఆనంద్, చిన్నారి, నాగభూషణం పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి..


గ్రీవెన్స్ సెల్‌లో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

- కమిషనర్‌ను కోరిన అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధులు

విజయనగరం: నగరంలోని 25వ డివిజన్ పరిధిలో నిర్మించనున్న అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, త్వరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు తమ సమస్యలను వినతిరూపంలో కమిషనర్ పి. నల్లనయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాలుగు వినతులు రాగా.. వాటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక వినతి ఉన్నాయి. సమస్యలు తెలుసుకున్న కమిషనర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించరూ..


నేలపైనే కూర్చుని అర్జీ రాసుకుంటున్న వ్యక్తి


తమకు పింఛన్లు మంజూరు కాలేదని చెబుతున్న కుమిలి గ్రామస్తులు


పూర్తిస్థాయి పింఛన్ ఇవ్వాలని కోరుతూ కుమార్తెను కలెక్టరేట్‌కు తీసుకువచ్చిన అంబటివలస వాసి


సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలు


సమస్యలు వివరించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన హిందూ ధార్మిక సంస్థ సభ్యులు

సమస్యలు విని మాకో పరిష్కారం చూపించాలని అర్జీదారులు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. ఎన్నిసార్లు సమస్యలు తెలియజేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు. దివ్యాంగురాలైన తన కుమార్తెకు పూర్తిస్థాయి పింఛన్ మంజూరు చేయాలని అంబటివలసకు చెందిన ఓ వ్యక్తి కుమార్తెతో సహా కలెక్టరేట్ రావడం పలువురిని కలిచివేసింది. మరోవైపు సమస్యలను ఎలా చెప్పుకోవాలో తెలియక.. సాయం చేసేవారు లేక.. పలువురు ఇబ్బంది పడుతూ నేలమీద కూర్చునే అర్జీలు రాసుకున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు వస్తే అన్ని రకాలుగా సహాయం అందేదని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పలువురు గుసగుసలాడుకోవడం విశేషం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ప్రేమ సమాజానికి ఆర్థిక సాయం


ప్రేమ సమాజానికి ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మి

విజయనగరం: నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రేమసమాజానికి నగరానికి చెందిన లెంక లక్ష్మి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మేరకు ప్రేమ సమాజం ప్రాంగణంలో సమాజం అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, కార్యదర్శి రెడ్డి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు కనకల రఘురామారావులకు సోమవారం నగదు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రేమ సమాజం అందిస్తున్న సేవల్లో పాలు పంచుకునేందుకు గాను సహాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం కోశాధికారి బలివాడ అప్పారావు, ముఖ్య సలహాదారు వి.సుబ్బరాజు, సహాయ కార్యదర్శి సీహెచ్ చిన్నయ్యలు పాల్గొన్నారు.